క్లుప్తంగా

హరగోపాల్‌పై 'ఉపా' కేసు అక్రమం

వరంగల్: ప్రముఖ పౌరహక్కుల నాయకుడు హరగోపాల్, పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య, అరుణోదయ విమల, పద్మజతో పాటు మరో 152మంది తెలంగాణలోని ప్రజా సంఘాలు, రచయితలు, హక్కుల సంఘాల నేతలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) 'ఉపా' కేసును నమోదు చేయడం అక్రమమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ వరంగల్ జిల్లా కమిటీ కమిటీ కార్యదర్శి గోపన్న ఒక ప్రకటనలో ఖండించారు. అక్రమ కేసును ఎన్ఐఏ తక్షణమే ఉపసంహరించుకోవాలని సూచించారు. ప్రశ్నించే వారిపై ఫాసిస్టు బీజేపీ ప్రభుత్వం కేసులు నమోదు చేసి వేధింపులకు పాల్పడటం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు.

నేడు జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి నిర్మల్‌సింగ్ రాక

హన్మకొండ: జమ్మూ కశ్మీర్ మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ నిర్మల్ సింగ్ ఈనెల 17న హనుమకొండ పర్యటనకు వస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన సందర్భంగా నిర్వహిస్తున్న మహా జనసంపర్క్ అభియాన్ కార్యక్రమం, ప్రవాస యోజనలో భాగంగా ఆయన హనుమకొండకు వస్తున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటలకు వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని, అనంతరం ఉదయం 9గంటలకు హనుమకొండ హంటర్‌రోడ్డులోని వేద బంక్వెట్ హాల్‌లో జరగనున్న సమావేశంలో పాల్గొంటారని వివరించారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి

న్యూశాయంపేట: మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్ సుల్తాన్‌ను ముందస్తు అరెస్టు చేయడమనేది సిగ్గుమాలిన చర్య అని, ఇలాంటి అక్రమ అరెస్టులను ప్రజాస్వామికవాదులంతా ఖండించాలని సీపీఎం జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యారంగ, ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను మంత్రులు వస్తున్నప్పుడల్లా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

నచ్చిన రంగాల్లో ఎదగాలి



బ్యాగులు పంపిణీ చేస్తున్న సమన్విత

వరంగల్: విద్యార్థులు కష్టపడి చదువుతూ నచ్చిన రంగాల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎన్ఆర్ఐ సాయి సమన్విత సూచించారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌలి పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, స్నాక్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఎంతో కష్టపడి చదివి అమెరికాలో ఉంటున్నానని చెప్పారు. అక్కడ పాప్ సింగర్‌గా, యాక్టర్‌గా పనిచేస్తున్నానని వివరించారు. అమెరికాలో యాక్టింగ్ ద్వారా సంపాదించిన 300 డాలర్లను ఇక్కడి విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ఆర్ఐల కుటుంబ సభ్యులు కంచారపు వెంకటేశ్వర్లు, లలిత, పద్మ, హెచ్ఎం కవిత, టీచర్లు నర్సింగరావు, గంగాధర్ తిలక్, శ్రీనివాస్, రమేష్, అలీ, అశోక్, సుకన్య, లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

కాపు సంఘం జిల్లా కార్యాలయం ప్రారంభం



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని రెడ్డి కాలనీలో మున్నూరుకాపు జిల్లా సంఘం కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు కొత్త దశరథం పటేల్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల ఐక్యత, అభివృద్ధి కోసం జిల్లావ్యాప్తంగా గ్రామ, డివిజన్ కమిటీల నియామకం, కుల నమోదు కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు వివరించారు. రాజకీయాలకు అతీతంగా మున్నూరుకాపులు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ బాధ్యులు అల్లం మల్లికార్జున్, సాయిని రవీందర్, రంగరాజు సాయికుమార్, కొండా నాగరాజు, కత్తుల కవిత, గోలి రాంచందర్, తక్కళ్లపెల్లి మనోహర్, పుప్పాల రజనీకాంత్ పాల్గొన్నారు.

ప్రమాదంలో తల్లీబిడ్డకు గాయాలు

మామునూరు: వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీబిడ్డకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం మండలం శాపూర్‌కు గ్రామానికి చెందిన సునీత, ఆమె తల్లి ఇరువురు కలిసి మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నారం గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన ఫంక్షన్‌కు బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో చెన్నారం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఆ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దాంతో తల్లీబిడ్డలు రోడ్డు మీద పడిపోగా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ఆలయాల్లో మాసశివరాత్రి ప్రత్యేక పూజలు

మడికొండ: మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ప్రాతఃకాల మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం యాగశాలలో గణపతి, రుద్రహోమం నిర్వహించారు. సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.శేషుభారతి, అర్చకులు పరాశరం విష్ణువర్ధనచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మ, మణిశర్మ, ఆలయ చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు భూపాల్‌రెడ్డి, ఓర్సు రాజు, సంధ్యారాణి, పెద్ది ప్రభాకర్, భక్తులు అద్దెంకి సురేష్ – రజిని దంపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



మెట్టుగుట్టపై హోమం నిర్వహిస్తున్న అర్చకులు



కాశీ విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

కాశీ విశ్వేశ్వరాలయంలో..

కాశిబుగ్గ: జేష్ఠమాస మాసశివరాత్రిని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలవారుజామున 11మంది బ్రహ్మణుల వేద మంత్రోచ్చరణల మధ్య మహానాస్యస పూర్వక 'మహారుద్రం' అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలోని సహస్ర లింగానికి అన్నపూజ చేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రవి, బండారి అనిల్, శ్రీనివాస్, రాము, అర్చకులు గుండేటి రజనికుమార్, మార్త సందీప్, కొడం ప్రవీణ్‌కుమార్, కళ్యాణ్, మోహన్, రాజేష్, సారంగం తదితరులు పాల్గొన్నారు.

'ఏం ముఖం పెట్టుకుని వస్తున్నారు'



వరంగల్: మాట్లాడుతున్న వెంకటరమణ



ఖిలా వరంగల్: మాట్లాడుతున్న సతీష్‌బాబు

వరంగల్: జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ నేతలు.. ఏం ముఖం పెట్టుకుని జిల్లా పర్యటనకు వస్తున్నారని బీజేపీ తూర్పు నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ ప్రశ్నించారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని తూర్పు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతీసారి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అనేక హామీలను ఇస్తూ.. అందులో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని, శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ ఐటీఐ కళాశాల నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలని, నేత్ర వైద్యశాలను ఆధునీకరించాలని, శిథిలమైన బస్టాండ్‌ను కూల్చి కొత్తది నిర్మించాలని సూచించారు. ఈమేరకు పలు డిమాండ్లతో కూడిన లేఖను విడుదల చేశారు.

కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం..

ఖిలా వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారని మంత్రి కేటీఆర్ నియోజకవర్గ పర్యటనకు వస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్‌బాబు ప్రశ్నించారు. ఆయన పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. శివనగర్‌లో నియోజవర్గ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సతీష్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే నరేందర్ వైఖరిపై ప్రజలు విసుగు చెంది ఉన్నారని అన్నారు. 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో కబ్జాలు తప్ప రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రంజిత్, ఎరుకల రఘునారెడ్డి, జలగం రంజిత్, బైరి మురళీకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తోరణాలతో నిరసన



నిరసన తెలుపుతున్న బక్క జడ్సన్, నాయకులు

మడికొండ: మడికొండ ప్రజల ప్రాణాలకు రక్షణ కరువైందని కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు కేటీఆర్ పర్యటన సందర్భంగా మడికొండ యూనియన్ బ్యాంక్ వద్ద డివైడర్ మధ్యలో ఉన్న చెట్లకు మడికొండ డంపింగ్ యార్డు చెత్తతో తోరణాలు కట్టి నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జడ్సన్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగతో స్థానికులు శ్వాసకోశ వ్యాధులతో పాటు చర్మవ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరితే ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వరంగల్‌ను స్మార్ట్ సిటీ, క్లీన్ సిటీ, డ్రీమ్ సిటీ చేస్తానన్న మంత్రి కేటీఆర్.. వరంగల్‌ను స్మోక్ సిటీగా మార్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ అంకూస్, బొడ్డు అనిల్, తుల రవి, ఎల్లాగౌడ్, చల్ల తిరుపతి, కొలిపాక ప్రకాష్, సుదర్శన్, వక్కల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పలు పార్టీల నాయకులు పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ప్రేమలత, కోమల్ దంపతులతో పాటు వారి అనుయాయులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి చీఫ్‌విప్ ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర రుణవిమోచన కమిషనర్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, నాయకులు విజయలక్ష్మి, సురేందర్, వద్దిరాజు గణేష్, షఫీ, పరశురాములు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు నిర్వహించాలి

కరీమాబాద్: ఉష్ణోగ్రత తీవ్రత తగ్గేవరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట తరగతులు నిర్వహించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య, అంబేడ్కర్ విద్యార్థి సమాఖ్య కమిటీల నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టరేట్‌లో ఏఓ శ్రీకాంత్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏబీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడుతూ ఎండల కారణంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాస్ సావిత్రి, రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మర్కజీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సుజిత్

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు మిశ్రీన్‌సుల్తానా, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. కొన్ని పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ ఇవ్వలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, సాయి, సందీప్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి

ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) వరంగల్ మహానగర కార్యదర్శి ఆరెపెల్లి సుజిత్ ఆరోపించారు. హనుమకొండలోని ఏబీవీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ వెంటనే అందించాలని సూచించారు. అనంతరం, గుర్తింపులేని ప్రైవేటు పాఠశాలలను రద్దుచేయాలని హనుమకొండ డీఈఓ ఎంఈఓ అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేశారు.

'టెక్స్‌టైల్స్ పార్కు పేరుతో రియల్ ఎస్టేట్'

వరంగల్: జిల్లాలో కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని పీసీసీ నాయకుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆరోపించారు. పోచమ్మ మైదాన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్స్ పార్కులో మౌలిక వసతులు ఏర్పాటు చేయకుండా కేవలం కంపెనీలకు ఎకరాల కొద్ది భూములు కేటాయించడంపైనే వారు దృష్టి సారించారని ఎద్దేవాచేశారు. మరో ఏడాది కాలుష్య నియంత్రణ మండలి ఇచ్చిన గడువులోగా హామీ మేరకు సౌకర్యాలు ఏర్పాటు చేయకుంటే జిల్లాకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హామీలు నెరవేర్చకుండా మళ్లీ జిల్లాకు వస్తున్న మంత్రి కేటీఆర్ పర్యటనను అడ్డుకోవాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు.

తగ్గిన రిజిస్ట్రేషన్ల జోరు

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల జోరు తగ్గింది. సాధారణంగా ప్రతీరోజు 130 నుంచి 150 వరకు దస్తావేజులు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసుకుని ఖజానాకు కోటి రూపాయలకుపైగా ఆదాయం వచ్చేది. కాగా.. బుధవారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ప్రవేశపెట్టిన బయోమెట్రిక్ విధానం (సబ్ రిజిస్ట్రార్ అథెంటిక్ ఐడెంటిఫికేషన్)తో భూక్రయవిక్రయ దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సుమారు అర్ధగంటకు పైగా సమయం పడుతుండడంతో రిజిస్ట్రేషన్ల జోరు అమాంతం తగ్గింది. బుధవారం 69 దస్తావేజులు, గురువారం 77, శుక్రవారం 75 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని ఖజానాకు కేవలం రూ.50 లక్షల ఆదాయాన్ని మాత్రమే సమకూర్చింది. కాగా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్లు తగ్గినట్లు సమాచారం.

కొనసాగిన డబ్బాల తొలగింపు

వరంగల్ అర్బన్: కేటీఆర్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం రోడ్లకు ఇరువైపులా ఉన్న చిరువ్యాపారుల డబ్బాలు, తోపుడుబండ్లు, షెడ్లను తొలగించారు. బల్దియా డీఆర్ఎఫ్, చైన్‌మెన్లు, ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ఆక్రమణలను ఖాళీ చేయించారు. హడావుడిగా తమను ఖాళీ చేయించడం సరికాదని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.

జువైనల్ హోంకు నలుగురు మైనర్లు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురు మైనర్లను జువైనల్ హోంకు తరలించారు. జువైనల్ మెజిస్ట్రేట్ ఆదేశం మేరకు బాలురను ఒకరోజు పరిశీలనకు శుక్రవారం పంపించినట్లు సీఐ కె.రామకృష్ణ తెలిపారు. కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టి ద్విచక్ర వాహనాలను నడిపిస్తున్న బాలురను సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. మరోమారు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 475 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: జిల్లాలో శుక్రవారం ఉదయం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలో 4,039 మంది విద్యార్థులకుగాను 475 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన సెకండియర్ పరీక్షలో 1,659 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 146 మంది గైర్హాజరయ్యారు.

ఫార్మసీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీఫార్మసీ విద్యార్థులకు గత సంవత్సరం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించటం లేదని ఎస్ఎస్‌యూఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, ప్రధాన కార్యదర్శి అల్వాల రాకేష్ అన్నారు. వెంటనే వారికి పరీక్షలు నిర్వహించాలని కోరారు. ఈమేరకు అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధికకు వినతిపత్రం అందజేశారు.

సైబర్ మోసం

● పార్ట్‌టైం జాబ్ అంటూ నమ్మించి రూ.11వేలు లూటీ

కాశిబుగ్గ: సైబర్ వలలో చిక్కి ఇంజనీరింగ్ విద్యార్థిని రూ.11 వేలు నష్టపోయింది. మామునూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థినికి పార్ట్‌టైం జాబ్స్ ఉన్నాయని, ఆసక్తి ఉంటే మేసేజ్ చేయండి అంటూ గుర్తుతెలియని నంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దానికి ఆ విద్యార్థిని అనుకూలంగా మెసేజ్ చేయగా, రిజిస్ట్రేషన్ కోసం రూ.వేయి పంపాలని సైబర్ నేరగాళ్లు ఓ లింక్‌ను పంపారు. ఆ లింక్ క్లిక్ చేసి రూ.వేయి పంపించింది. అలా సైబర్ నేరగాళ్లు ఎలా చేప్తే అలా లింక్‌లన్నీ ఓపెన్ చేసింది. దాంతో ఆమె ఖాతాలో నుంచి రూ.41 వేల బదిలీ అయ్యాయి. తాను మోసపోయాయని గ్రహించిన ఆ విద్యార్థిని వెంటనే 1930కి కాల్ చేయగా రూ.30 వేలు ఆమె ఖాతాలో హోల్డ్ అయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'గిరిజన బంధు' అమలు చేయకపోతే ఉద్యమం

హన్మకొండ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపులోపు గిరిజన బంధు పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయాలని చేయాలని, లేకుంటే ప్రత్యక్ష పోరాటాలు చేపడుతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాం నాయక్ హెచ్చరించారు. గిరిజన బంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అంతకుముందు ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన బంధు అమలు చేస్తామని గత ఏడాది సెప్టెంబర్ 17న సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. గిరిజన బంధు అమలు చేయకుండా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో గిరిజన ఉత్సవాలు నిర్వహించడం గిరిజనులను మోసం చేయడమేనని అన్నారు. ధర్నా కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లకొండ శ్రీకాంత్, కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, నాయకులు జగన్, తిరుపతి, రమేష్, సిద్దు, నరసింహ, రమ, సుమలత, సారయ్య, స్వరూప, లాలూ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

యోగా విశ్వవ్యాప్తం కావడం గర్వకారణం



యోగా సాధనలో జడ్జి సత్యేంద్ర, తదితరులు

హన్మకొండ కల్చరల్: దేశంలో పుట్టిన యోగా విశ్వవ్యాప్తం కావడం భారతీయులందరికీ గర్వకారణమని, యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వరంగల్ జిల్లా జడ్జి సత్యేంద్ర అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం పిలుపు మేరకు కౌంట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం వేయిస్తంభాల దేవాలయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు నక్కలగుట్ట కాకతీయ హరిత హోటల్‌లో జరుగుతున్న యోగా శిక్షణ తరగతుల్లో భాగంగా పురావస్తుశాఖ సహకారంతో ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్జి సత్యేంద్ర పాల్గొని యోగా సాధన చేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఇందిర, సాధకులు జయశ్రీ, చిరంజీవి, రవీంద్రచారి, హరి, ప్రసాద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

21న 'మ్యూజికల్ మీట్ ఫర్ పీస్'

హన్మకొండ కల్చరల్: ఈనెల 21న వరల్డ్ మ్యూజిక్ డే పురస్కరించుకుని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో 'మ్యూజికల్ మీట్ ఫర్ పీస్' సంగీత విభావరి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపకుడు మహమ్మద్ సిరాజుద్దీన్ తెలిపారు. హనుమకొండలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో సాయంత్రం సంగీత విభావరి జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల గాయని, గాయకులు తెలుగు, హిందీ భాషల్లో సినిమా పాటలు పాడేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. జనరల్ కేటగిరీలో 20మందికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సురేష్‌లాల్, సెక్రటరీ శ్రీపాద సుధాకర్‌రావు, సంగీత విద్వాంసులు తిరుపతయ్య, పీఆర్వో నిమ్మల శ్రీనివాస్, సాగంటి మంజుల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిరాజుద్దీన్

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, కన్వీనర్ డాక్టర్ సాదు రాజేష్, బాధ్యులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ ఫిరోజ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ ఎన్నిక



దేవోజీనాయక్, అధ్యక్షుడు



సోల్తి కిరణ్‌గౌడ్, జనరల్ సెక్రటరీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ నూతన కమిటీని హనుమకొండలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ దేవోజీనాయక్, జనరల్ సెక్రటరీగా సోల్తి కిరణ్‌గౌడ్, మహిళా కన్వీనర్‌గా డాక్టర్ భాగ్యమ్మ ఎన్నికయ్యారు. సమావేశంలో పార్ట్‌టైం అధ్యాపకుడు వీరేందర్, పైండ్ల కిరణ్‌కుమార్, వినోద, సుధీర్, భాగ్యమ్మ, లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, డాక్టర్ సంజీవ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కార్తీక్

హసన్‌పర్తి: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎస్వీఆర్ పాఠశాలకు చెందిన కార్తీక్ ఎంపికయ్యాడు. నగరంలోని జేఎన్ఎస్ మైదానంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో కార్తీక్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిపోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ నరేంద్రదేవ్ తెలిపారు. ఈనెల 17, 18వ తేదీల్లో హైదరాబాద్‌లోని షేక్‌పేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో కార్తీక్ పాల్గొంటాడని చెప్పారు. ఈ సందర్భంగా హసన్‌పర్తి జిల్లా పరిషత్ మైదానంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కార్తీక్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, ఆత్మ చైర్మన్ చంద్రమోహన్, పీడీ పార్థసారథి పాల్గొన్నారు.



అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, తదితరులు

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఎస్ఆర్ఆర్ తోట అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమాదేవి

కరీమాబాద్: అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి సూచించారు. గ్రేటర్ పరిధిలోని 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోట బీరన్నకుంట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లులకు ప్రీస్కూల్ ప్రాధాన్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని చెప్పారు. రెండేళ్లు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో, ఐదేళ్లు దాటిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఆయా పద్మ పాల్గొన్నారు.